ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 26 అక్టోబరు 2024

3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి ఉషు, అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఉషు, అథ్లెటిక్స్ పోటీలు స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో వచ్చే నెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్నట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-17, 19 విభాగాల్లో జరగనున్న ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1200 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారు. ఈ నెల 27న స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో అండర్-17, 19 జిల్లాస్థాయి ఉషు క్రీడాకారుల జట్టు ఎంపిక నిర్వహించనున్నా'మని వారు తెలిపారు.

న్యూస్ బాక్స్



మంత్రి అచ్చెన్నాయుడు

భావనపాడు హార్బర్ ఏర్పాటుకు కృషి

- సాధ్యాసాధ్యాలు పరిశీలనకు కేంద్ర బృందం రాక
- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భావనపాడు తీరప్రాంత మత్స్యకారుల కోసం హార్బర్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు పరిశీలనకు ఈనెల 28, 29 తేదీల్లో బెంగుళూరు నుంచి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీ కేంద్ర బృందం రానున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. భావనపాడులో మత్స్యశాఖ అధికారులతో కేంద్ర బృందం రెండురోజులపాటు సమావేశం కానున్నట్టు సీఐసీఈఎఫ్ డైరెక్టర్ ఎన్.వెంకట ప్రసాద్ నుంచి సమాచారం వచ్చిందన్నారు. భావనపాడులో హార్బర్ ఏర్పాటుకు కృషి చేస్తానని మత్స్యకారులకు హామీ ఇచ్చానని, అందులో భాగంగానే కేంద్ర బృందం పర్యటించనున్నట్టు తెలిపారు.

- భావనపాడు పంచాయతీలో భావనపాడు, కొత్తపేట, మజ్జిపేట, రెడ్డికపేట గ్రామాలున్నాయి. వీటి పరిధిలో 2,503 మంది జనాభా నివసిస్తున్నారు. భావనపాడు గ్రామానికి సంబంధించి సుమారు 700 మంది మత్స్యకారులు చేపల వేట కోసం.. సముద్రంలోకి 15 కిలోమీటర్లు దాటి వెళ్తుంటారు. ఈ పంచాయతీ నుంచి సుమారు 97 మోటార్ బోట్లు, 51 పడవలను వినియోగిస్తున్నారు. భావనపాడు తీరంలో జూన్ నుంచి (మిగతా 8వ పేజీలో..)



తీరంలో భద్రత ఏదీ?

- మెరైన్ స్టేషన్ల ఏర్పాటులో జాప్యం
- 11 మండలాలకు ఉన్నవి మూడే..
- సిబ్బంది కొరతతో తీవ్ర ఇక్కట్లు

జిల్లాలో తరచూ తుఫాన్లు సంభవిస్తుంటాయి. మత్స్యకారులు వేటకు వెళ్లి ప్రమాదాలకు గురవుతుంటారు. మరికొందరు తీర ప్రాంతాల్లో విహారయాత్రకు వచ్చి సముద్ర స్నానానికి దిగుతుంటారు. ఈ క్రమంలో ఏటా పదుల సంఖ్యలోనే మృత్యువాత పడుతున్నారు. కానీ దీనిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు కానరావడం లేదు. దీనికి సరైన రక్షణ వ్యవస్థ లేకపోవడమే కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తీరం వెంబడి 11 మండలాల్లో.. మండలానికి ఒకటి చొప్పున మెరైన్ పోలీస్ స్టేషన్లు ఉండాలి. కానీ ఉన్నది మూడే. దాదాపు 120 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా.. సగం మందికి మించి లేరని తెలుస్తోంది. ఫలితంగా తీర ప్రాంత రక్షణ డొల్లగా మారుతోంది.

ఇచ్ఛాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)

సుదీర్ఘ తీరప్రాంతం జిల్లా సొంతం. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లో తీర ప్రాంతం ఉంది. 143 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. మారుమూల కుగ్రామాలు 20వరకూ ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా తీర ప్రాంతాల్లో భద్రత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వందలాది కిలోమీటర్లు ఉన్న తీర ప్రాంతంలో ఉన్నది మూడే మెరైన్ పోలీస్ స్టేషన్లు. వీటి సంఖ్య పెంచుతామన్న ప్రకటనలు ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. వాస్తవానికి కానిస్టేబుల్‌కు ఒక గ్రామం చొప్పున బాధ్యతలు అప్పగించాలి. కానీ సిబ్బంది కొరత కారణంగా ఐదు నుంచి పది గ్రామాల బాధ్యతను ఒక్కో కానిస్టేబుల్ చూస్తున్న సందర్భాలు ఉన్నాయి. తుఫాన్ల సమయంలో మత్స్యకారులను అప్రమత్తం చేయడం.. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించడం ఇబ్బందిగా మారుతోంది.

● ఆ మూడుచోట్ల ఏర్పాటు..

జిల్లాలో కళింగపట్నం, భావనపాడు, బారువలో మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. సముద్ర తీరంలో 12 నాటికల్ మైళ్ల దూరం వరకూ నిరంతర భద్రతా చర్యలు పర్యవేక్షించాలి. విదేశీ మత్స్యకారులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలి. నేవీ విభాగానికి సమాచారం అందించాలి. కానీ ఓ వైపు సిబ్బంది కొరత, మరోవైపు విధి నిర్వహణకు అవసరమైన మరబోట్లు, అత్యాధునిక పరికరాలు కూడా లేని దుస్థితి. దీంతో సిబ్బంది బాధలు వర్ణనాతీతం. గతంలో సమకూర్చిన మరబోట్లు, పరికరాలు తితలీ తుఫాన్ సమయంలో పాడయ్యాయి. కానీ వాటి స్థానంలో కొత్తవి సమకూర్చలేదు.

- 11 తీర మండలాల బాధ్యతను మూడు మెరైన్ పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు. బారువ మెరైన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, మందస మండలాలు ఉన్నాయి. 36 తీర ప్రాంత రెవెన్యూ గ్రామాలు, మరో ఐదు శివారు గ్రామాలున్నాయి. ఇక్కడ 42 మంది కానిస్టేబుళ్లకు 9 మంది మాత్రమే ఉన్నారు. ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో శివారు మండలాల్లో విధుల నిర్వహణ కష్టతరంగా మారుతోంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి మందస మండలం గంగువాడ వరకూ విధి నిర్వహణ కత్తిమీద సాములా మారింది. తీర ప్రాంతాల పర్యవేక్షణ తూతూమంత్రంగా సాగుతోంది.
- భావనపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో 63 తీరప్రాంత రెవెన్యూ గ్రామాలున్నాయి. మరో ఏడు శివారు గ్రామాలున్నాయి. ఇక్కడ 82మంది సిబ్బంది ఉండాలి. కానీ కేవలం 29మంది మాత్రమే ఉన్నారు. ఖాళీలు, అరకొర వసతులతో తీర ప్రాంత రక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది.
- కళింగపట్నం పరిధిలో గార, శ్రీకాకుళం రూరల్, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో 43 తీర ప్రాంత రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ 48 మంది కానిస్టేబుళ్ల విధులు నిర్వహించాల్సి ఉండగా.. కేవలం 18 మంది మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం.. తీరప్రాంతాల్లో భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మెరైన్ పోలీసుస్టేషన్లతో పాటు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాల్సి ఉంది.



భావనపాడు మెరైన్ పోలీసుస్టేషన్

చౌకగా మోసం!

- ఎంఎల్‌ఎస్ గోదాముల వద్ద తగ్గుతున్న బియ్యం
- ఆందోళన చెందుతున్న డీలర్లు

- మెళియాపుట్టి మండలం జలగలింగుపురం రేషన్ డిపోకు సంబంధించి 370 రేషన్ కార్డులకు గానూ ప్రతి నెల 54 క్వింటాళ్ల బియ్యం రావాలి. కానీ ప్రతి నెలా 60 నుంచి 80 కిలోల బియ్యం తగ్గుతుండడంతో డీలర్ ఆందోళన చెందుతున్నాడు. ఆ లోటు బియ్యాన్ని ఇతరుల దగ్గర కొనుగోలు చేసి ఎండీయూ వాహనదారుడికి ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నాడు.

- మెళియాపుట్టి మండలం సుందరాడ రేషన్ డిపో పరిధిలో 465 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెల 92 క్వింటాళ్ల బియ్యం రావల్సి ఉండగా.. 70 నుంచి 100 కిలోల వరకూ తగ్గుతున్నాయి. దీంతో తమకు నష్టం తప్పడం లేదని డీలర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మెళియాపుట్టి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో ఎంఎల్‌ఎస్ గోదాముల నుంచి డిపోలకు సరఫరా చేసే బియ్యంలో తరుగు వస్తుండడంతో రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు.. మెళియాపుట్టి మండలంలో 44 రేషన్ డిపోలు ఉండగా.. ఒక్కో డిపోకు ప్రతి నెలా సుమారు 100 కిలోలు తగ్గుతున్నట్టు తెలుస్తోంది. ఈ బియ్యం ఎక్కడకి వెళుతున్నాయో అర్థం కావడం లేదు. వైసీపీ పాలనలో ఇంటింటికీ రేషన్ సరుకులు అందించాలనే ఉద్దేశంతో రూ.కోట్లు వెచ్చించి ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేసినా ప్రయోజనం కనిపించలేదు. ఈ-పాస్ యంత్రాలు, ఎలక్ర్టానిక్ కాటాలు తెచ్చినా.. బియ్యం తరుగుదల తగ్గడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ బియ్యం దందాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలుచోట్ల గోదాములు తనిఖీ చేసి.. అక్రమాలు గుర్తించారు. కానీ ఇంకా గోదాముల్లో అక్రమ దందాలు తగ్గడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



మెళియాపుట్టి ఎంఎల్‌ఎస్ గోదాంలో బియ్యం బస్తాలు..

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 1,603 చౌకధరల డిపోల పరిధిలో 6,71,803 రేషన్ కార్డులు ఉన్నాయి. 422 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ కార్డుదారులందరికీ బియ్యం సరఫరా చేస్తున్నారు. కాగా.. పౌరసరఫరాల గోదాముల నుంచి మండలాల్లో రేషన్ డిపోలకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. వాటిని డీలర్లు తూకం వేసి.. ఎండీయూ వాహన ఆపరేటర్లకు అప్పగిస్తారు. కాగా.. గోదాముల వద్ద తూకం వేసి.. రేషన్ డిపోలకు తెచ్చిన బియ్యంలో తరుగు కనిపిస్తోందని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ఒక్కో డిపోకు 80 కేజీల నుంచి 100 కేజీల వరకూ తరుగు వస్తోందని.. గోదాముల వద్ద కాటాలో ఏదో మతలబు ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. గోదాముల్లో తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని (మిగతా 8వ పేజీలో..)

6వేల ఎకరాలు.. రూ.60వేల కోట్లతో..

- బీపీసీఎల్ రిఫైనరీకి ప్రతిపాదన
- మూలపేట పోర్టు సమీపంలో ఏర్పాటు

టెక్కలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు సమీపంలో ఆరువేల ఎకరాల్లో రూ.60వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు జరుగుతున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన ఒప్పందంలో భాగంగా ఈ ప్రాజెక్ట్ రాష్ట్రానికి కేటాయించింది. దీంతో రాష్ట్రంలో మచిలీపట్నం, దుగ్గిరాజుపాలెం. మూలపేట ప్రాంతాలను గుర్తించారు. ఈ మూడు ప్రాంతాలను త్వరలో సీఎం చంద్రబాబు పరిశీలించి.. తుది నిర్ణయం తీసుకుంటారు. మచిలీపట్నం తీరానికి లోతుగా ఉండడంతో రిఫైనరీ ఏర్పాటుకు అనుకూలంగా లేదని తెలుస్తోంది. ఎక్కువ అవకాశాలు మూలపేట పోర్టుకే ఉన్నాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి పోర్టు పూర్తిచేస్తా'మని మంత్రి అచ్చెన్న తెలిపారు. ఇదిలా ఉండగా.. సంతబొమ్మాళి మండలంలో రిఫైనరీ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం ఇప్పటికే బీపీసీఎల్ అధికారులు.. రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆరువేల ఎకరాల స్థలం సమకూర్చేందుకు రెవెన్యూ అధికారులు సైతం ప్రణాళికలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు జరిగితే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఉద్దానంలో ఎలుగులు

- భయాందోళనలో ప్రజలు

హరిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):మందస మండలం ఉద్దానం ప్రాంతమైన సరియాపల్లి, బహడపల్లి, జంతిబంద పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఎలుగుబంట్లు సంచరించాయి. నాలుగు ఎలుగులు గ్రూపుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. జీడితోటల్లో రైతులు పనులు చేస్తుంటారు. తుప్పలు, ముళ్లపొదలు, గడ్డి తొలగించి.. దుక్కులు దున్నుతుంటారు. ఎలుగుల సంచారం అధికమవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో వరుసగా దున్నూరు, ఎర్రముక్కాం, బాతుపురం గ్రామాల్లో జరిగిన ఎలుగుబంట్ల దాడుల్లో సుమారు ఎనిమిది మంది మృతి చెందారు. మరి కొంతమంది నేటికీ వివిధ వ్యాధుల బారిన పడి దివ్యాంగులుగా మారారు. దీంతో ఎలుగులను చూస్తే రైతులు హడలిపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుల నుంచి రక్షణ కల్పించాలని వారంతా కోరుతున్నారు.



సరియాపల్లి వద్ద సంచరిస్తున్న ఎలుగులు

మరణించి.. పునర్జన్మనిచ్చి!

- జెమ్స్‌లో వ్యక్తి బ్రెయిన్‌డెడ్
- అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులు

8లో

పేదల ఇళ్లలో కొంగొత్త దీపావళి

- ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీకి బుకింగ్ ప్రారంభం

హమ్మయ్యా..!

- తప్పిన దానా తుఫాన్ ముప్పు
- పెను నష్టం లేకపోవడంతో రైతులకు ఊరట

నరసన్నపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ ముప్పు తప్పింది. రెండు రోజులుగా మబ్బులు కమ్ముకున్నాయి. శుక్రవారం చిరుజల్లులు పడడంతో రైతులు ఆందోళన చెందారు. అయితే తుఫాన్ ఒడిశాలో తీరం దాటడం.. జిల్లాపై అంత ప్రభావం లేకపోవడంతో ఉద్దానంలో కొబ్బరి రైతులు, మైదాన ప్రాంతంలో అన్నదాతలు ఊరట చెందారు. నరసన్నపేట నియోజకవర్గంలో సారవకోట, పోలాకి, నరసన్నపేట, జలుమూరు మండలాల్లో చాలాచోట్ల గాలుల ప్రభావంతో వరిపైరు నేలకొరిగింది. దీంతో కోత పెట్టుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. అయితే పెద్దగా నష్టం లేకుండా.. తుఫాన్ గండం గట్టెక్కడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



జమ్ము వద్ద నేలకొరిగిన వరి పంట

పేదల ఇళ్లలో కొంగొత్త దీపావళి

- ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం
- వంట గదిపై తగ్గనున్న ఆర్థిక భారం
- ప్రారంభమైన బుకింగ్



హిరమండలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

సామాన్యుల వంటింటి ఖర్చు కాస్త తగ్గనుంది. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో వంట గ్యాస్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పేద ప్రజలకు కాస్త ఊరటనిస్తోంది. ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి 3 చొప్పున ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఈ మేరకు దీపావళి నుంచి వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇవ్వనుంది. దీంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వీటి కోసం ఈ నెల 24 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. 31 నుంచి పంపిణీ మొదలు కానుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.

ఏం చేయాలంటే..

కొనుగోలు సమయంలో సిలిండర్ ధర రూ.850ని లబ్ధిదారుడు చెల్లించాలి. సిలిండర్ ఇచ్చిన 48 గంటల్లో ఆ మొత్తం వారి బ్యాంకు ఖాతాలో జమవుతాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై నెలాఖరు వరకు మొదటి సిలిండర్, ఆగస్టు నుంచి నవంబరు నెలాఖరు వరకు రెండోది, డిసెంబరు 1 నుంచి 2026 మార్చి వరకు మూడో సిలిండర్ ఇస్తారు. ఈ ఏడాది మాత్రం వచ్చే ఏడాది మార్చి నెలఖరులోగా ఒక సిలిండర్ పొందవచ్చు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి ఈ పథకం వర్తిస్తుంది.

జిల్లాలో కనెక్షన్లు ఇలా...

జిల్లాలో సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 3,01,212, డబుల్ కనెక్షన్లు 12,01,272, దీపం పథకం ద్వారా సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 17,6487, డబుల్ 16,746 ఉన్నాయి. ఉజ్వల పథకం కింద 56,584, సీఎస్ఆర్ కింద 14,477 కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 5,65,500 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 19,75,730 తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు.

దీపం పథకంలో...

మహిళలకు కట్టెల పొయ్యి నుంచి విముక్తి కలిగించేందుకు 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు దీపం పథకాన్ని తీసుకువచ్చారు. పేద ప్రజలకు లబ్ధి చేకూర్చారు. మళ్లీ ఇప్పుడు మహిళలకు ఇంటి ఖర్చును తగ్గించడానికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వనుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



శివసాగర్ తీరంలో ప్రశాంతంగా ఉన్న సముద్రం

'అల'సి.. సొలసి!

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 25: కొద్ది రోజులుగా జిల్లా ప్రజలను భయపెట్టిన 'దానా' తుఫాన్ ఒడిశాలో తీరం దాటింది. తుఫాన్ తీవ్రంగా ఉంటుందనే హెచ్చరికలతో జనం నిద్ర లేకుండా గడిపారు. జిల్లాపై ఎటువంటి ప్రభావం చూపకపోవడంతో ఊరట చెందారు. ప్రస్తుతం సముద్రం ప్రశాంతగా మారింది. రెండు రోజులుగా ఎగసిపడిన రాకాసి అలలలో ఆందోళన చెందిన తీరప్రాంత వాసులు సముద్రం శాంతించడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. దీనికి తోడు సముద్రం 50 మీటర్లు వెనుకకు వెళ్లడంతో పర్యాటకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. అయినా స్నానాలకు దిగే వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అలల మధ్యలో కోరింతకు గురైన ఇసుక మేటలతో గోతులు ఉంటాయని... ఈత రాని వారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

'చౌక'గా మోసం!

(ఏడో పేజీ తరువాయి)

ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు చాలా గోదాముల వద్ద తరుగు వస్తున్నట్టు అధికారులు సైతం నివేదికలు అందజేసినట్టు తెలుస్తోంది.

పక్కదారి..

ప్రస్తుతం మార్కెట్‌లో రేషన్ బియ్యానికి అధిక ధర ఉంది. కిలో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. దీంతో రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. జిల్లాలో కొంత మంది లబ్ధిదారుల వద్ద రేషన్‌బియ్యాన్ని కిలో రూ.20కు వ్యాపారులు కొనుగోలు వాటిని.. మిల్లర్లకు రూ.25కు విక్రయిస్తున్నారు. గోదాముల్లో మిగిలిన బియ్యాన్ని కూడా.. కొంతమంది వ్యాపారులకు రహస్యంగా విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు సైతం కొన్ని బియ్యం బస్తాలను మిగిలించి.. గోదాముల్లో పనిచేస్తున్న కొంతమంది ద్వారా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. గోదాముల నుంచి తరుగు లేకుండా బియ్యాన్ని అందించాలని డీలర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై పాతపట్నం సీఎస్ డీటీ బెజ్జి ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా.. గోదాముల నుంచి రేషన్ బియ్యం తూకం వేసి డిపోలకు అందజేస్తున్నామని తెలిపారు. ఎక్కడ తేడా జరుగుతుందో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు వివరిస్తున్న డీఎస్పీ శేషాద్రి

ఆయుధాలు ఎలా పని చేస్తాయంటే...

ఎచ్చెర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'యుద్ధాన్ని వెదుక్కుంటూ ఆయుధాలు వాటంతట అవే వస్తాయి' ఆ మధ్య వచ్చిన ఓ తెలుగు సినిమాలోని డైలాగ్ ఇది. అదే తరహాలో సమయం వచ్చినపుడు మా ఆయుధాలూ అదేస్థాయిలో పని చేస్తాయంటున్నారు మన పోలీసులు. పోలీసు అమర వీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలోని కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం పోలీసు ఓపెన్ హౌస్‌ను నిర్వహించారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో వినియోగించే సాంకేతిక పరికరాలు, కమ్యూనికేషన్, బాంబు డిటెక్షన్, డిస్పోజల్ సామగ్రి, వివిధ రకాల ఆయుధాల పనితీరును వివరించారు. డ్రోన్స్ వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీ వార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్, స్పీడ్ గన్, నేర పరిశోధనలో, బాంబులను గుర్తించడంలో పోలీసు జాగిలాల పనితీరు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నట్టు డీఎస్పీ శేషాద్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పంచాయతీకి ఒకటే సచివాలయం

- ప్రక్రియ మొదలు పెట్టిన అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక



ఇలాయిపురం సచివాలయం

మెళియాపుట్టి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలంలోని ఇలాయిపురం సచివాలయంలో గొట్టిపల్లి, అంపురం, ఇలాయిపురం గ్రామ పంచాయతీలకు కలిపి గతంలో ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. దీని వల్ల గత ఐదేళ్లగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముగ్గురు సర్పంచులకు ఒకే కుర్చీ వేయడం వల్ల తగదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అలాకాకుండా ఉండాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సచివాలయాల ప్రక్షాళనకు సిద్ధమవుతోంది. దీని కోసం కమిటీ వేసింది. ఈ వ్యవస్థలోని లోపాలను ప్రభుత్వానికి నివేదించినట్టు తెలుస్తోంది. దశల వారీగా పంచాయతీకి ఒక సచివాలయం ఉండే విధంగా చర్యలు తీసుకోవటానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. గత ఐదేళ్లలో సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు గందరగోళ పరిస్థితుల మధ్య విధులు నిర్వహించేవారు. ఎవరి ఆదేశాలు పాటించాలో తెలియని పరిస్థితి. జీతాలు ఇచ్చేది ఒకరైతే...హాజరు చూసేది చూసేది మరొకరు. పనితీరును విశ్లేషించేది వేరొకరు. ఇలా గందరగోళంగా విధి నిర్వహణ ఉండేది. బాస్‌ల సంఖ్య కూడా ఎక్కువగా ఉండేది. మొదటి నుంచీ వైసీపీ సర్పంచులు సైతం దీన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఒక్కో సచివాలయానికి 11 మంది చొప్పున ఉద్యోగులను నియమించారు. వారిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరు ఎక్కడ ఉంటున్నారో... ఎవరు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉండేది. ఇన్నాళ్లకు ఈ వ్యవస్థను గాడిలో పెట్టే దిశగా అడుగులు పడుతున్నాయి. డీడీవోలుగా ఉన్న కార్యదర్శులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడానికి... జనాభా తక్కువగా ఉన్న సచివాలయాల్లో ఉద్యోగులను తగ్గించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

ఆ నాణెం పదిలమే!

- 10 నాణెంపై రంగంలోకి ఆర్‌బీఐ
- తీసుకోవాలని విస్తృత ప్రచారం..
- సందేహాల నివృత్తికి 14440 టోల్‌ఫ్రీ నెంబర్
- నాణేలను తీసుకోవడానికి నిరాకరిస్తే జైలు శిక్ష



నరసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)

మీకు మార్కెట్‌లో ఎవరైనా పది రూపాయల నాణెం ఇస్తుంటే...తీసుకోవడానికి సందేహిస్తున్నారా? మీరు ఎవరికైనా పది రూపాయల నాణం ఇవ్వబోతే... వారు అందుకోవడానికి నిరాకరిస్తున్నారా? ఎవరికీ ఎటువంటి సందేహాలు అవసరం లేదు. పది రూపాయల నాణేన్ని నిస్సందేహంగా తీసుకోవచ్చు. అవి చెలామణిలోనే ఉన్నాయి. గత కొంతకాలంగా పది రూపాయల నాణెంపై విస్తృత చర్చ నడుస్తోంది. బస్సులో కండక్టర్ల నుంచి వ్యాపారుల వరకు వీటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అవి చెల్లుబాటు కావనే ప్రచారం సాగడమే ప్రధాన కారణం. చాలామంది దగ్గర ఉన్న నాణేలు ఏం చేయాలో తోచక అలాగే ఉంచేశారు. ఈ నేపథ్యంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రంగంలోకి దిగింది. ఈ నాణేలు పూర్తిగా చెల్లుబాటవుతాయని... వాటి వినియోగంపై ఎలాంటి సందేహాలు వద్దని ఆర్‌బీఐ చెబుతోంది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు ఇస్తోంది. రూ.10 నాణేలను ఎవరైనా తిరస్కరిస్తే మూడేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. ఎవరికైనా అభ్యంతరాలు.. సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 14440కు మిస్ కాల్ ఇవ్వాలని సూచిస్తోంది. నాణేలపై 30 గీతలు ఉన్నా చెల్లుబాటవుతాయని ఆర్‌బీఐ తెలిపింది. రూ.10 నాణేలను తీసుకోవాలని వివిధ కార్పొరేషన్లు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాయి. ఈ నాణేలు చెల్లుబాటవుతాయని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ బ్యాంకుల శాఖలు తమ కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా పోస్టర్లను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నాయి.



నరసన్నపేట స్టేట్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎందుకిలా అంటే...

కేంద్ర ప్రభుత్వం 2016 నవంబరులో రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేసింది. వాటి స్థానంలో కొత్తగా రూ.2వేలు, రూ.500 నోట్లు విడుదల చేసింది. దీంతో ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.పది నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చింది. మరోవైపు కొన్ని బ్యాంకుల్లో అప్పట్లో వీటిని తిరస్కరించారు. దుకాణాలలోనూ చిల్లర బరువు ఎక్కువవుతుందనో.. లేక రద్దు చేస్తారనే భయమో... మొత్తం మీద యజమానులు తీసుకోవడం మానుకున్నారు. ఫలితంగా రూ.పది నాణెం చెల్లదనే వదంతులు మొదలయ్యాయి. ఫలితంగా ఎవరూ దీన్ని తీసుకోవడానికి ముందుకు రావడం మానేశారు.

మరణించి.. పునర్జన్మనిచ్చి!

- జెమ్స్‌లో వ్యక్తి బ్రెయిన్‌డెడ్
- అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులు
- పోలీసు బందోబస్తుతో తరలింపు



అవయవ దాతకు నివాళులర్పిస్తున్న దృశ్యం



జగదీష్ (ఫైల్)

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ పడిపోయిన ఘటనలో బ్రెయిన్‌డెడ్ కావడంతో అతని అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మరికొందరికి ప్రాణదానం చేశారు. వివరాల్లోకి వెళితే... సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన గరుగు జగదీష్(40)అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ ఇంటిలో పడిపోయాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయమైంది. రెండు రోజుల తరువాత స్థానికంగా ఉన్న ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి.. తలలో రక్తస్రావమైందని... అత్యవసర వైద్యం చేయించాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతనిని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే రక్తస్రావం అధికం కావడంతో జగదీష్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. మరోసారి వైద్య పరీక్షలు చేసినజెమ్స్ వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయినట్టు కుటుంబ సభ్యులకు తెలిపారు. వైద్యుల సూచనతో జగదీష్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు.

● విశాఖకు తరలింపు..

జగదీష్ అవయవాలను గ్రీన్‌చానల్ ద్వారా విశాఖకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని జెమ్స్ ఆస్పత్రి వర్గాలు సంప్రదించాయి. ఎస్పీ ఆ విషయాన్ని విశాఖ సీపీ బాచికి తెలియజేశారు. అవయవాలు తరలించేందుకు రోడ్డు క్లియర్ చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జగదీష్ అవయవాలను జెమ్స్ ఆస్పత్రి నుంచి విశాఖపట్నం ఎయిర్ పోర్ట్‌కు గంటన్నర వ్యవధిలో తరలించారు. అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. జగదీష్ రెండు కిడ్నీల్లో ఒకటి విశాఖలోని అపోలో ఆస్పత్రికి, మరొకటి జెమ్స్‌లో 12 ఏళ్ల బాలుడికి అందించారు. ఊపిరితిత్తులను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అవయవ దాతకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

● ఘనంగా నివాళి..

అవయవ దానం చేసిన జగదీష్ పార్థివదేహానికి జెమ్స్ వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులకు ధ్రువపత్రాన్ని, ప్రభుత్వం అందించిన రూ.10వేల నగదును జిల్లా వైద్యశాఖాధికారి డా.బొడ్డేపల్లి మీనాక్షి, జెమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ హేమంత్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.అంబేడ్కర్, జనరల్ మేనేజర్ డా.ప్రవీణ్ కుమార్, డా.బాలమురళి తదితరులు పాల్గొన్నారు.



వాహనానికి దారిస్తూ...

భావనపాడు హార్బర్ ఏర్పాటుకు కృషి

(ఏడో పేజీ తరువాయి)

సెప్టెంబరు వరకు రొయ్యలు, అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు కోనేం, టూనా, వంజరం, చందవ రకాల చేపలు లభ్యమవుతాయి. మిగిలిన సీజన్లలో కానాగత్తలు, కలవలు, గులివిందలు, నెత్తల్లు, మాగలు, చిదుములు, కారలు తదితర రకాల చేపలు లభ్యమవుతుంటాయి. ఇక్కడ హార్బర్ ఏర్పాటు చేస్తే.. తమకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని పేర్కొంటున్నారు. ఈ దిశగా మంత్రి అచ్చెన్న చేస్తున్న కృషిపై మత్స్యకార సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



'తుఫాన్ వెళ్లిపోయింది. ఇంక ఆందోళన వీడి.. కాసేపు నన్ను చూసి ఆహ్లాదంగా గడపండి' అన్నట్టుగా శుక్రవారం సాయంత్రం ఆకాశం విభిన్న వర్ణాలతో కనువిందు చేసింది. కుంకుమ రంగుతో చూపరులను కట్టి పడేసింది. మేఘాలు పరుగులు తీస్తూ సందడి చేశాయి. -కంచిలి

నేడు సర్వసభ్య సమావేశం

ఆమదాలవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తమ్మినేని శారద ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశ ప్రారంభమవుతుందని, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన్నారు. పూర్తి సమాచారంతో మండల స్థాయి అధికారులు విధిగా రావాలని ఆదేశించారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో ఒక ఏడాది కాల వ్యవధిలో పరీక్షలు రాసి తప్పిన విద్యార్థుల కోసం సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నవంబరు 4 నుంచి 18వ తేదీ వరకు, తృతీయ సంవత్సర పరీక్షలు నవంబరు 20 నుంచి డిసెంబరు 2 వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

వ్యాస రచన పోటీలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా పట్టణ సీఐ చిన్నంనాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఆదిత్య జూనియర్ కళాశాల, కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, స్వర్ణభారతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు చిన్నంనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ

గుజరాతీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ హాస్టల్స్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగర పరిధిలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం హైస్కూల్, ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌తోపాటు సింగుపురం వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు.

చేపల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

ఆమదాలవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్, కేవీకేతో కలిసి స్వదేశీ మత్స్యకార సంఘ సభ్యులకు వృత్తివిద్యా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా చేపల పెంపకంలో మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాస్త్రవేత్త సీహెచ్ బాలకృష్ణ, మత్స్య సహాయకుడు భాస్కర్, శాస్త్రవేత్తలు రాయ్, సునీత, హరికుమార్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై హర్షం

రణస్థలం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్నదని, అండమాన్ నికోబార్ దీవుల్లో ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేపట్టనుండడం ఆనందంగా ఉందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోద కార్యక్రమానికి అండమాన్ నికోబాద్ దీవులకు తనతోపాటు తెలుగుదేశం పార్టీ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మాణిక్యరావు యాదవ్‌ను అతిథిగా ఆహ్వానించారని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇచ్ఛాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం రోడ్డు మలుపు వద్ద ప్రైవేట్ బస్సు అదుపు తప్పి గుంతలో కూరికిపోయి త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బరంపురం నుంచి ఇచ్ఛాపురం మీదుగా పాత్రపురం వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు జగన్నాథపురం వద్ద రోడ్డు మలుపులో ఉన్న గోతులో బస్సు వెనుక చక్రాలు కూరికిపోయాయి. దీంతో బస్సు ముందు భాగం ఒక్కసారిగాపైకి లేచిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఆహాకారాలు వేస్తూ భయాందోళన చెందారు. వెంటనే స్థానికలు బస్సు వద్దకు చేరుకొని పయాణికులను బయటకు దించారు. ఎదురెదురుగా వస్తున్న బస్సును తప్పించే క్రమంలో మలుపు ఉండడం.. అదే చోట గోయ్యి ఉన్నందున ఆ బస్సు వెనుక చక్రాలు కూరుకుపోయాయి.



రోడ్డుకిరువైపులా అడవిని తలపిస్తున్న దృశ్యం

అడవి కాదు.. ప్రధాన రహదారే!

చిగురువలస సమీపంలో ఉన్న పాలకొండ, సరు బుజ్జిలి ప్రధాన రహదారి అడవిని తలపిస్తుంది. ఒకప్పుడు అడవి రోడ్డు గా పేరొందిన ఈ రహదారి ప్రస్తుతం సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో అదే పరిస్థితి దాపురించింది. రోడ్డుకు ఇరువైపులా భారీ స్థాయిలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిపడుతు న్నారు. పాలకొండ నుంచి సరుబుజ్జిలి, హిరమండలం, పాతపట్నం ప్రాంతా లతోపాటు తెలికిపెంట వద్ద వంశధార నదిపై వంతెన నిర్మాణం తర్వాత టెక్కలి, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం, బరంపురం ప్రాంతాలకు భారీ స్థాయిలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటువంటి రహదారి ముళ్లపొదలతో నిండిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న ఈ పిచ్చి మొక్క లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

పశుపోషణతో ఆర్థిక పురోగతి

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ భారత దేశంలో పశువుల పెంపకం కీలకమైన ఆర్థిక వనరని, ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కిష్టప్పపేటలో పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పశుపోషణ అదనపు ఆదాయాన్ని అందిస్తుందన్నారు. భూమిలేని కుటుంబాలకు ప్రాథమిక జీవనోపాధిగా ఉపయోగపడుతుందని, ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ఆదాయవనరుగా ఉంటుందన్నారు. దేశ వ్యాప్తంగా అక్టోబరు 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు 21వ అఖిల భారత పశుగణన చేపట్టనుందన్నారు. ఈ పశుగణన భవిష్యత్ ప్రణాళిక, విధాన రూపకల్పనకు కీలకమైన సమాచారం అందిస్తుందన్నారు. పశుగణన ప్రతీ ఐదేళ్లకోసారి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్థానిక సహాయ సంచాలకులు పీఎస్‌జీ బాలకృష్ణ, సహాయ సంచాలకులు, వీసీపీ వైవీ కృష్ణారావు, పశు వైద్యాధికారులు తిరుపతిరావు, దిలీప్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించాలి

ఆమదాలవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణనకు ప్రజలందరూ సహకరించాలని పశువైద్య సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్, టీడీపీ నాయకులతో కలిసి పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సమాచారం సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, పీవీవీకే రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు నాగేశ్వరరావు, లక్ష్మణరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, కూటమి నాయకులు



రణస్థలం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

- సరుబుజ్జిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశుగణన సక్రమంగా చేపట్టాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. షలంత్రి గ్రామంలో శుక్రవారం పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభి పోస్టర్‌ను ఆవిష్కరించారు కార్యక్రమంలో ఎంపీటీసీ శివ్వాల సూర్యనారాయణ, పశువైద్యాధికారి సతీష్ పాల్గొన్నారు.

పశుగణన సర్వే పక్కాగా చేపట్టాలి

రణస్థలం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) అఖిల భారత పశుగణన సర్వే పక్కాగా చేపట్టాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అధికారులకు ఆదేశించారు. ఈ సర్వేకు సంబంధించిన గోడపత్రికను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు పశుగణ సర్వే చేయించుకోవాలని, జీయో టాగింగ్ ఇంటి వద్దే చేపడతారన్నారు. ఈ సర్వే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరగనున్నదని స్పష్టం చేశారు. ఏడీ దుర్గారావు తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి: ఎస్పీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

ఎచ్చెర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు పరేడ్‌ను పరిశీలించారు. తొలుత సాయుధ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. అలాగే ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్లలోని పోలీసు కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం పోలీసు సిబ్బందికి, వారి పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. ప్రతిభ చూపినవారికి ప్రశంసా పత్రాలను, బహుమతులు ఎస్పీ చేతుల మీదుగా అందజేస్తారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలకు, పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు ఇతర సమస్యలపై ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీవో ఎస్.రామమోహనరావు, కూటమి నాయకులు పీస వెంకటరమణ మూర్తి, గుండ భాస్కరరావు, గొండు వెంకటరమణ మూర్తి, బడగల వెంకట అప్పారావు, కొంక్యాన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణం వద్దు



ఆందోళన చేస్తున్న వ్యాపారులు

రణస్థలం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రణస్థలంలో ఫ్లై ఓవర్ నిర్మాణం వద్దు, బైపాస్ ఏర్పాటు చేయాలని ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు పిన్నింటి సాయికుమార్, ఇదడాసుల తిరుపతిరాజు, అల్లు యుగంధర్, జె.రమేష్, డి.భుజంగరావు, గుప్తా తదితరులు డిమాండ్ చేశారు. రూ.252 కోట్లతో రణస్థలంలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కారి ప్రకటన చేయడంపై వ్యాపారులు నిరసన తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఆందోళన చేశారు. బైపాస్ ఏర్పాటు చేయడం వల్ల అన్నివిధాలుగా రణస్థలం అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు ఉపాధి అవకాశాలు దండిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో టేకు బ్రహ్మాజీ, గాజుల భాస్కరరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఎగవేసిన వ్యాపారులకు రూ.12 లక్షల జరిమానా

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేస్తూ పక్కవారి పేరిట బిల్లులు సృష్టించి ఇనుప తుక్కును తరలిస్తున్న కంటైనర్‌ను శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారులు (విజిలెన్స్) పట్టుకుని రూ.12 లక్షలు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. రాజాం, పూసపాటిరేగ, సాలూరు, శ్రీకాకుళానికి చెందిన కొందరు వ్యాపారులు ఇనుప తుక్కును వేరే వ్యక్తుల పేరిట బిల్లులు సృష్టించి జీఎస్టీ ఎగవేసి సరుకును గుంటూరులోని కొన్ని కంపెనీల సహాయంతో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇనుప తుక్కు తరలిస్తున్న పలు లారీలను శుక్రవారం పట్టుకున్నట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బి.ప్రసాదరావు తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో బృందాలు రాజాం వద్ద రెండు లారీలు, శ్రీకాకుళం, సాలూరు, పూసపాటిరేగల వద్ద ఒక్కో లారీ చొప్పున పట్టుకున్నట్టు వివరించారు. సంబంధిత పన్ను ఎగవేతదారుల నుంచి జీఎస్టీ అధికారుల ద్వారా రూ.12,06,980 జరిమానా వసూలు చేసినట్టు చెప్పారు. దీనిపై విచారణ చేపట్టగా ఇటువంటి లావాదేవీలు గుంటూరులోని మురళీ ట్రేడర్స్ యాజమాన్యం చేస్తున్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. తక్షణమే వారి జీఎస్టీని రద్దు చేశామన్నారు. వ్యాపారులంతా చట్టప్రకారం పన్నులు చెల్లించాలని విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు సూచించారు.

కొన్నావీధిలో కోలాటం



కోలాటం ఆడుతున్న బృందం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొన్నావీధి భీమేశ్వరాలయంలో నందెమ్మ సంబరాల్లో భాగంగా బిందెలతో దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలేశ్వర కోలాట బృందం వారిచే కోలాట ప్రదర్శన చేపట్టారు.

పరిశుభ్రంగా ఉంచాలి



కింతలిలో స్టోర్‌ను పరిశీలిస్తున్న న్యాయాధికారి జ్యోత్స్న

పొందూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వసతిగృహాన్ని, పరిసరాలను సిబ్బందితో పాటు విద్యార్థులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. కింతలి, తాడివలస బీసీ బాలుర వసతి గృహాలను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కింతలి, తాడివలస వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని ఫోన్‌లో సంబంధిత అధికారును ఆదేశించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, వసతిగృహ సంక్షేమాధికారి ఉన్నారు.

చిన్నారుల ప్రతిభ

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సిక్కోలుకు చెందిన చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ చిన్నారులు ఇటీవల ముంబైలో జరిగిన రంగోత్సవంలో ప్రతిభ చూపారు. 14 బంగారు, ఐదు సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలు సాధించారు. ఈ 27వ తేదీ ఆదివారం నిర్వహించనున్న కార్యక్రమంలో వీరికి పతకాలు అందించనున్నట్టు సంస్థ చైర్మన్ నందికేశ్వరరావు తెలిపారు.

కఠిన చర్యలు తప్పవు

ఆమదాలవలస: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రాంబాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన గనులశాఖ ఆర్ఐ మాణిక్యాలరావుతో కలిసి నాగావళి తీరంలో తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తు న్న రెండు లారీలను పట్టుకున్నారు. కాగా స్థానికులు కొందరు వసూళ్లకు పాల్పడుతున్నట్టు లారీ డ్రైవర్లు ఆరోపించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

సోంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఈ నెల 1 నుంచి అమలు చేస్తున్న విధానంతో గ్రామీణ ప్రజలకు, ఏజెంట్లకు సమస్యాత్మకంగా మారుతుందని పలువురు ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన విధానానికి వ్యతిరేకంగా ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు రాజేంద్రనాయుడు, కోదండరావు, ప్రకాష్, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన

పొందూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు పోలీసు విధులు, బాధ్యతలు, చట్టాలుపై అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయుదాలు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు పలు అంశాలపై ఏఎస్ఐ రామచంద్రరావు వివరించారు.

జిల్లా విద్యార్థుల ప్రతిభ

గుజరాతీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్వహించిన క్విజ్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఈ నెల 28వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇద్దరు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు కాగా, ఎచ్చెర్ల నుంచి ఇద్దరు ఎంపికయ్యారు.

వీరి ప్రతిభపై కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ తదితరులు అభినందించారు.

బోరు బాగు చేశారు..



ఆమదాలవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదో వార్డు మెట్టక్కివలస హడ్కోకాలనీల మరమ్మతులకు గురైన తాగునీటి బోరును ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు శుక్రవారం మరమ్మతులు చేశారు. ఆ వార్డు మాజీ కౌన్సిలర్ గొల్లపల్లి సింహాద్రి తాగునీరు బోరు తుప్పు పట్టి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు స్పందించలేదని 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో బోరు మరమ్మతులు చేపట్టండి అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి, తక్షణమే మరమ్మతులు చేపట్టారు.

వారం రోజుల్లోనే..



రాళ్లు తేలి పాడైపోయిన రోడ్డు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించే నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వారం రోజుల కిందట ఈ గుంతలను ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇలా వేశారో లేదో.. అలా రాళ్లు తేలిపోయాయి. ఈ నాశరకం పనులు చూసిన స్థానికులు.. ఇంకా జగనన్న పాలన నుంచి అధికారులు బయటపడినట్టు లేదంటూ గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

స్థల పరిశీలన

ఇచ్ఛాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామంలో ఏర్పాటు చేయబోతున్న మురుగునీటి శుద్ధి కర్మాగారం నిర్మాణానికి ఆర్డీవో శుక్రవారం స్థల పరిశీలన చేశారు. గ్రామంలో 23సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అధికారులతో కలిసి గుర్తించారు. తహసీల్దార్ ఎన్.వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, డీటీ శ్రీహరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు



పొందూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): లోలుగు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఎండిపోయిన భారీ చెట్టు ప్రమాదకరంగా మారింది. ఇది ఎప్పుడు కూలుతుందోనని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈ చెట్టును తొలగించాలని హెచ్ఎం సంజీవరావు ఆర్అండ్‌బీ ఏఈ పీటీ రాజును కోరారు. ఈ వృక్షంతో పాటు ప్రమాదకరంగా మారిన చెట్లు తొలగిస్తామని ఏఈ రాజు తెలిపారు.

పబ్లిక్ నోటీస్

[illegible]

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా పొందూరువాసి



పొందూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా పొందూరు పట్టణానికి చెందిన గుంటుకు గిరిజా శంకర్‌ను రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న గిరిజా శంకర్‌ను పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ పర్యావరణ అంచనాల కమిటీ సభ్యుడిగా ఎంపికచేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మూడేళ్ల పాటు గిరిజా శంకర్ ఈ పదవిలో కొనసాగనున్నారు. గిరిజాశంకర్ నియామకంపై మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, సాయికుమార్, డాక్టర్ ప్రకాశరావు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

వేధింపుల కేసులో భర్తకు రెండేళ్ల జైలు శిక్ష

నరసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన కేసులో భర్తకు రెండేళ్ల జైలుశిక్షను విధిస్తూ జూనియర్ సివిల్ న్యాయాధికారి హెచ్.హరిప్రియ శుక్రవారం తీర్పు ఇచ్చారని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. స్థానిక గాంధీనగర్‌కు చెందిన బొనెల సాంబశివరావు అలియస్ సాంబ నిత్యం మద్యం సేవించి భార్య నాగలక్ష్మిని వేధించేవాడు. దీనిపై భార్య 2022 డిసెంబరు 5న పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ సింహాచలం, ఏఎస్ఐ కాంతారావు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిపై శుక్రవారం న్యాయాధికారి విచారణ చేపట్టారని, నేరం రుజువు కావడంతో సాంబశివరావుకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని, ఏపీపీ శాంతి సంతోషి వాదించారని ఎస్ఐ తెలిపారు.

బాడాంలో భారీ బాణసంచా నిల్వలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మందుగుండు సామాన్లు

నరసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాడాం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా సామాన్లను శుక్రవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలో శివ్వాల సత్యనారాయణ ఇంట్లో బాణసంచా సామగ్రి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించామన్నారు. సత్యనారాయణ సుమారు రూ.2 లక్షల విలువ చేసే సామగ్రిని నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి కేసు నమోదుచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో రెవెన్యూ అధికారులు పద్మావతి, ప్రసాద్ పాల్గొన్నారు. బొరిగివలస గ్రామంలో కూడా ఒక షాపులో భారీగా నిల్వలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో హైవే ఉద్యోగికి తీవ్ర గాయాలు

లావేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బుడుమూరు వద్ద గల జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో హైవే ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్‌కు చెందిన సంతోష్ కుమార్ హైవే విభాగంలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుడుమూరు వద్ద మరమ్మతులు చేస్తుండగా శ్రీకాకుళం వైపు నుంచి రణస్థలం వైపు వస్తున్న ఆటో సంతోష్‌ను బలంగా ఢీ కొనడంతో ఫ్లైఓవర్‌పై నుంచి కిందకుపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

సాగునీరు కలుషితంపై ఫిర్యాదు

లావేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బుడుమూరు నారాయణ సాగర్ నుంచి పంట పొలాలకు వెళ్లే పంట కాలువలో ఏదో పరిశ్రమకు చెందిన రసాయన వ్యర్థాలు విడిచి పెట్టడంతో వరి పంటకు నష్ట వాటిల్లిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బాధిత రైతులు శుక్రవారం లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

గంజాయి కలకలంపై పోలీసుల ఆరా

శ్రీకాకుళం క్రైమ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలంలోని ఓ గ్రామంలో ముగ్గురు యువకులు గంజాయి తాగుతున్నట్టు వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినా, అక్కడక్కడా ఇటువంటి ఘటనలు బయట పడుతుండడం పోలీసులకు సవాల్‌గా నిలిచింది. గంజాయిని సిగరెట్ రూపంలో సిద్ధం చేస్తున్న దృశ్యాలను వీడియో తీసిన యువకులు.. తమ స్నేహితులకు పంపించడంతో ఈ ఘటన బయటపడింది. ఈ విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తుంది. ఎస్ఐ ఎస్.సందీప్ కుమార్‌తో మాట్లాడగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని పరిశీలిస్తామని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 16 వినతులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని వెంటనే సంబంధిత స్టేషన్ల హౌస్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కువగా రెవెన్యూకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని, వీటి పరిష్కారం కోసం సంయుక్తంగా గ్రీవెన్స్ నిర్వహించనున్నామన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


వంట గదిని పరిశీలిస్తున్న న్యాయాధికారి

కొత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి సూచించారు. వనప కస్తూర్బా పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట గది అధ్వానంగా ఉండడం, వంట పాత్రలు శుభ్రంగా లేకపోవడం, బాత్‌రూమ్‌లకు డోర్లు లేకపోవడం, సీసీ కెమెరాలు పనిచేయకపోడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

జలుమూరు, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో కార్తీకమాసోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. కార్తీక మాసంలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు క్యూలైన్లు, ఎండ తగలకుండా షామియానాల ఏర్పాటుతో పాటు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. నవంబరు 2వ తేదీ నుంచి కార్తీక మా సం ప్రారంభమవుతుందన్నారు. దీనికి సంబంధించి క్యూలైన్లను శుక్రవారం ఏర్పాటు చేశారు.

దువ్వాడ శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు


దువ్వాడ శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

కాశీబుగ్గ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గ టీడీపీ నాయకుడు, కార్మిక వర్తక సంఘాల గౌరవాధ్యక్షుడు, 17వ వార్డు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు శుక్ర వారం పద్మనాభపురంలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను టీడీపీ నేతలు, కార్మిక, వర్తక సంఘాల ప్రతినిధులు, అభిమానులు కలిసి శుభా కాంక్షలు తెలిపారు. ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రజాసేవలో తనదైన ముద్ర వేసిన శ్రీకాంత్ భవిష్యత్‌లోనూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, వివిధ సంఘాల నేతలు తాళాసు కాంతారావు, గొలుసు వాసు, పిస్నింటి కాళీ, డొక్కరి రాజారావు, జె.శ్రీను, రామకృష్ణ, కొత్తకోట రమణ తదితరులు పాల్గొన్నారు.

కాలువలిలా.. నీరుపారేదెలా?

- శివారు భూములకు అందని సాగునీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


హంసరాలి సమీపంలో ముళ్లపొదలతో నిండిన సునాముది కాలువ

హరిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఐదు రిజర్వాయర్లు, జీవధార సునాముది, మహేంద్రతనయ వంటి నీటి వనరులున్నా శివారు ప్రాంత భూములకు సాగునీరందడం లేదు. దీంతో రైతులు పంటల సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటీ సాగునీటి కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉన్నా కనీస చర్యలు తీసుకోకపోవడంతో కాలువలు రూపే మారిపోతోంది. కరెంట్ ఉన్నా బోర్లకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా కాకపోవడం, కోతల వల్ల పంటకునీరు పెట్టుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ ఏడాది మండలంలో వరి పంటలకు నీరు లేక ఎండిపోయే స్థితిలో ఉన్నాయి. ఇటీవల వర్షాలు కురిసినా ప్రస్తుతం ఎండల తీవ్రత వల్ల డీజిల్ ఇంజన్లతో, గూడలతో పంటను తడపాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. నీటి వనరుల్లో నీరున్నా కాలువలు మరమ్మతులకు నోచుకోక చివర ఆయకట్టుకు చుక్క నీరందని దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ ఈ శ్రీనివాసరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా కాలువలను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు పూర్తి స్థాయిలో చేపడతామని, ఉపాధి హామీ పథకంలో కొన్ని పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

సభ్యత్వ నమోదులో మొదటి స్థానం సాధించాలి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పట్టు కొమ్మలని, గడచిన 40 ఏళ్లలో అనేక ఒడిదుడుకులు వచ్చినా చెక్కు చెదరలేదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో నియోజకవర్గ స్థాయి పార్టీ నేతలు, క్రియాశీలక సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమో దును ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి లక్ష్య సాధనలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించాలన్నారు. ఇతర పార్టీల వారు సభ్యత్వాలకు అర్హులు కారన్నారు. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీకోసం పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉండాలని నేతలకు సూచించారు. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, దానిని గాడిలో పెట్టేందుకు 5 నెలల కాలం పట్టిందన్నారు. చంద్రబాబు లాంటి వ్యక్తి సీఎం కావడం వల్లే ఇది సాధ్యపడిందన్నారు. నవంబరు, డిసెంబరుల్లో గ్రామసభల ద్వారా అర్హులను గుర్తించి పింఛన్లు అందించడం జరుగుతుం దన్నారు. నీటి సంఘాల ఎన్ని కలకు సిద్ధంగా ఉండా లని కోరారు. డిసెంబరు నెలా ఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కె.హరివర ప్రసాద్, టీడీపీ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బోయిన గోవింద రాజులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, బగాది శేష, రమేష్, జీరు బీమారావు, నేతలు కర్రి అప్పారావు, ఎల్ఎల్ నాయుడు, విజయలక్ష్మి, మెండ దమయంతమ్మ, మామిడి రాము తదితరులు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి ప్రాధాన్యం

కోటబొమ్మాళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు అన్నారు. శుక్రవారం పెద్దబమ్మిడిలో 21 అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం ప్రారంభమైన పశుగణన 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. సుమారు 150 కోట్ల కుటుంబాలకు చెందిన పశువుల వివరాలు నమోదు చేయాల్సి ఉందని దీనికి పాడి రైతులు సహకరించాలని కోరారు. ప్రస్తుతం యువతకు ప్రోత్సహిస్తూ డెయిరీ ఫారం నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయిలు మంజూరు చేస్తుందని, దీనిని యువకులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ ఆర్.మురళీధర్, డీడీ వి.జయరాజు, ఏడీఏలు ఎం.లోకనాథం, జి.లోకనాథం, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్ ఒడిశాలో తీరం దాటుతున్న నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని భావనపాడు మెరైన్ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుఫాన్‌తో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్లొద్ద న్నారు. తీరంలో ఉన్న వలలు, బోట్లను భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం కీలకం

నరసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని డా.బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ బీసీడీఈ (బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో బీసీడీఈపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంచేదిశలో ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వ చేపడుతోందన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి అప్పారావు, కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, కె.రాము పాల్గొన్నారు.

దుకాణాన్ని తొలగించాలి

పలాసరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవాలయ ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఈవో తలగాన వాసుదేవరావు అన్నారు. టెక్కలిపట్నం లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాన్ని శుక్రవారం పరిశీలించారు. రెండురోజుల్లోగా తొలగించాలని ఆదేశించారు. అంతకుముందు ఆలయ ఏకసభ్య ధర్మకర్తగా ఆయన ప్రమాణం చేశారు.

సేంద్రియ వ్యవసాయంతో మేలు

పలాసరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని వెలుగు ఏపీఎం జాంబవతి సూచించారు. వెలుగుసమాఖ్య భవనంలో ఫార్మర్ ప్రొడ్యూస్ గ్రూపు సభ్యులకు రెండోరోజు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పశుగణన: జేసీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పలాసరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశుగణన కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్న పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి పశుగణన చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే పూర్తి చేసి డోర్లపై స్టిక్కర్లను అంటించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక ఏడీ పి.చంద్రశేఖర్, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పశుగణనను ప్రారంభించిన ఎమ్మెల్యే

పోలాకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి చేపట్టిన పశుగణనను తలసముద్రం గ్రామంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే సరిగా చేపట్టి పాడి రైతులకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరప నారాయణ దాస్, వెంకటరమణ, మెండ ఆనందరావు, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలి

మందస,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశుగణనలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలు సేకరించి ఇళ్లకు సిక్కర్లను అతికించాలని పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి అన్నారు. శుక్రవారం స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు ధర్మేంద్ర, బాలకృష్ణ, శ్రీనివాస్, హరికృష్ణ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించొద్దు

- ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు


పాతపట్నం: బైదలాపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీవో చిన్నబాబు

పాతపట్నం/మెళియాపుట్టి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. పాతపట్నం మండలం బైదలాపురం, మెళియాపుట్టి మండలం బందపల్లి, పీఎల్‌పురం ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల పరిసరాలు, ఆహార పదార్థాల తయారీ, వంటగదులు, స్టాక్ గదులను పరిశీలించారు. తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సమయం వృథా చేయకుండా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. మెళియాపుట్టిలో నిర్మా ణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

కొత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గొట్టిపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డీవైఈవో నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న ఎస్ఏ-2కి సన్నద్ధం కావాలని సూచించారు. విద్యార్థులు బస చేసే గదులు, మరుగుదొడ్లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎంవో పొట్నూరు కోటిబాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ ఉత్సవాల ముగింపు


ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మబగాం, గొల్లలవలస, దీర్ఘాశి, పిరువాడ గ్రామాల్లో గత తొమ్మిదిరోజులుగా నిర్వహించిన గౌరమ్మ, నందెన్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మబగాంలో జరిగిన కార్యక్రమంలో బాలికల కోలాట ప్రదర్శనను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తిలకించారు. గొల్లలవలసలో మాజీ సర్పంచ్ పంచిరెడ్డి సింహాచలం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. యువకుల వేషధారణలు ఆకట్టుకున్నారు. దీర్ఘాశిలో సర్పంచ్ మెండ కృష్ణసుమంగళి, మాజీ సర్పంచ్ పల్లి నూరిబాబు, పిరువాడలో సర్పంచ్ దంతవెంకటరమణ, దంత సింహాచలం ఆధ్వర్యంలో ముగింపు ఉత్సవాలు జరిగాయి.

తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కాశీబుగ్గ,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పోస్టాఫీసు ఆవరణలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అన్ని కేడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఆచరణ కాని లక్ష్యాలను చేయాలంటూ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలని నినదించారు. తపాలాశాఖ కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చర్యలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ జిల్లా ప్రతినిధులు ఎన్.నందికేశ్వరరావు, బి.తానేసు, ఏఐపీఈయూ ప్రతినిధులు రాము, మోహనరావు, సతీష్ పాల్గొన్నారు.

రైల్వే కార్మిక సంఘాల ఎన్నికలకు సిద్ధంకండి

పలాస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రానున్న డిసెంబరు 4, 5, 6వ తేదీల్లో జరగనున్న రైల్వే కార్మిక సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని ఈస్ట్‌కోస్టు కాంగ్రెస్ జనరల్ కార్యదర్శి ఆర్‌సీసాహూ కోరారు. ఈ మేరకు శుక్రవారం పలాస రైల్వేస్టేషన్ కాంగ్రెస్ కార్యాలయంలో సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రైల్వే కార్మిక సంఘం ఎన్నికల్లో ఈస్ట్‌కోస్టు రైల్వే శ్రామిక్ కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీతో సభ్యులు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్ సునీల్‌బుంజ్, ఎన్ఎఫ్ఐ వర్కింగ్ కమిటీ సభ్యుడు సుధీర్‌పాఢి, రాజశేఖర్, ఎ.శ్రీనివాస్, ఎస్‌కెపండాలు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. నవంబరు 9, 10వ తేదీల్లో పలాసలో జరగనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోర శ్రీనివాసరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించాలి

నరసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి డా.తాడేల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం తామరాపల్లిలో ఫ్యామిలీ ప్రోగ్రాం శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను ముందస్తుగా గుర్తించి వారికి చికిత్స అందించాలని, ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం పనికిరాదన్నారు. రీ ప్రొడక్టివ్ చైల్డ్‌హెల్త్ ప్రోగ్రాంలో లక్ష్యాలను అధిగమించాలని మాకివలస వైద్యాధికారి శిరీషకు ఆదేశించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

హిరమండలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుందని, ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలన్నారు. రూ.100 కట్టి సభ్యత్వ నమోదు చేయించుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమాను పార్టీ కల్పిస్తుందన్నారు సభ్యులుగా చేరాలని ఆయన కోరారు.

ఇంటర్వ్యూ

మహిళాభివృద్ధికి చర్యలు

- టి.సూర్యనారాయణ, ఏపీఎం, వెలుగు



సంతబొమ్మాళి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి 'ఉమెన్ లెడ్' కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని వెలుగు ఏపీఎం టి.సూర్యనారాయణ తెలిపారు.

ప్రశ్న: ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఈ కార్యక్రమం ద్వారా ప్రతి మహిళ వ్యక్తిగతంగా యూనిట్లను స్థాపించేందుకు రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలిస్తున్నాం. వీరికి పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా కొన్ని యూనిట్లకు 35 శాతం సబ్సిడీ కూడా అందిస్తున్నాం.

ప్ర: మండలంలో ఎన్ని స్వయంశక్తి సంఘాలున్నాయి?

జ: మండలంలోని 50 గ్రామైక్య సంఘాల పరిధిలో 1,854 స్వయంశక్తి మహిళ సంఘాలున్నాయి.

ప్ర: ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంతమేర రుణాలిచ్చారు?

జ: 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్వయంశక్తి మహిళా సంఘాలకు రూ.60 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 428 సంఘాలకు రూ.25కోట్లు అందించాం.

ప్ర: స్త్రీ నిధి రుణాల లక్ష్యం ఎంత?

జ: మండలంలో 1,500 మందికి రూ.7 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 680 మందికి రూ.4.40 కోట్లను అందజేశాం.

న్యూస్ బాక్స్

ఆటపాటలతో విద్య: పీడీ

నరసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో సృజనాత్మ విద్యను అందించాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం పట్టణంలో బండివీధి, పెద్దపేట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పిల్లలకు నీతికథలు చెప్పాలని. అలాగే ఆటపాటలతో సమాజంపై అవగాహన పెంచాలన్నారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజ నాలను వివరించాలన్నారు. కేంద్రాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో పీవో నాగమణి పాల్గొన్నారు.

'అపార్' వేగవంతం చేయాలి

నరసన్నపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈవో పేడాడ దాలినాయుడు అన్నారు. శుక్రవారం సీఆర్ఎంటీలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలు వారీగా విద్యార్థుల వివరాలను తల్లిదండ్రుల ఆమోదంతో ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఎఫ్ఏ-1 మార్కులను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కరకవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆప్తాలమిక్ అధికారి డి.ప్రతాప్ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో ఇబ్బం దులు పడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రామారావు, సర్పంచ్ జి.యోగీశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

టెక్కలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఉదయం 9 గంటలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కార్యాల యంలో ప్రారంభిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, అన్ని విభాగాల ఇన్‌చార్జిలు హాజరుకావాలని కోరారు.

కళాశాల పరిశీలన

టెక్కలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాలను శుక్రవారం ఆర్ఐవో టి.దుర్గారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీసీ, బైపీసీ తరగతుల బోధనా విధానాన్ని పరిశీలించి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవాశ్రమం భవన నిర్మాణానికి స్థలం వితరణ

పోలాకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దండులక్ష్మీపురం పంచాయతీ చింతాడపేట రామయోగి సేవాశ్రమంలో భవన నిర్మాణానికి స్థలాన్ని జామి వాసుదేవరావు, మోహనరావు, మహేశ్వరరావు, లాడి శ్రీరామమూర్తి, పొట్నూరు వెంకటరమణ శుక్రవారం అందజేశారు. అగ్రిమెంట్ పత్రాలను ఆశ్రమం కమిటీ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథానికి అందించారు. ఈ సందర్భంగా స్థల దాతలకు ఆయన అభినం దించారు.

సెంచూరియన్‌లో 'బిజ్ ఫెస్ట్ 2.0'



మాట్లాడుతున్న విశాఖపట్నం ఐఐఎం ప్రొఫెసర్ కల్యాణ్

నెల్లిమర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాపారరంగంలో విజయం సాధించాలంటే వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం ఐఐఎం ప్రొఫెసర్ కె.కల్యాణ్ అన్నారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన బిజ్ ఫెస్ట్ 2.0 అనే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజయ్యారు. విద్యార్థులు తమకు అవసరమైన రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో సెంచూరియన్ వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డా.పల్లవి, మేనేజ్‌మెంటు విభాగం డీన్ డా.మోహన్‌బాబు, డీన్‌లు డా.సన్నిడయాల్, డా.విజయబాబు, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, అనిల్‌కుమార్, గ్రామ్ తరంగ్ సీఈవో బాబుశంకర్, పీఎస్‌వీ రమణారావు, హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.